క్లుప్తంగా

దళితబంధు నిధులు విడుదల చేయాలి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న లబ్ధిదారులు

కందుకూరు: దళితబంధు పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు నిధులు విడుదల చేయాలని కోరుతూ బుధవారం లబ్ధిదారులు జిల్లా కలెక్టర్ కె.శశాంకకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ.. పథకానికి సంబంధించి అన్ని పత్రాలు అందించామని, బ్యాంకు ఖాతా సైతం తెరిచామన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, సామయ్య, పారిజాత, చిన్రసాయిలు, దేవేందర్, బాబయ్య, జంగయ్య, రాములు, రవి, రామకృష్ణ, శ్రీకాంత్, రాజు, కృష్ణ, నవీన్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జంగారెడ్డి తదితరులు

కందుకూరు: పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు, మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి బుధవారం జిల్లా కలెక్టర్ శశాంక్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కందుకూరు మండలంలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు నరేందర్‌నాయక్, శ్రీధర్ ఉన్నారు.

అలరించిన రంగవల్లులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న జగదీష్, రమేష్

హుడాకాంప్లెక్స్: సంక్రాంతిని పురస్కరించుకుని సరూర్‌నగర్ డివిజన్ పరిధి కొత్తపేట చౌరస్తాలోని శ్రీలక్ష్మీ వైట్‌హౌస్ షాపింగ్ కాంప్లెక్స్‌లో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మహిళలు పెద్దఎత్తున హాజరై అందమైన ముగ్గులను పోటాపోటీగా వేశారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిరికి ప్రథమ బహుమతితో పాటు ద్వితీయ, తృతీయ బహుమతులను నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో శ్రీలక్ష్మీ వైభవ్ షాపింగ్ మాల్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది జగదీష్ నేత, ప్రధాన కార్యదర్శి తడక రమేష్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



ట్రోఫీని అందుకుంటున్న విజేత జట్టు

కందుకూరు: మండలంలోని అన్నోజిగూడ పరిధిలోని ఎన్టీఆర్ తండాలో సేవాలాల్ సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రఘురాం రాథోడ్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించి బుధవారం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మొత్తం 20 జట్లు టోర్నీలో ఆడారు. ప్రథమ స్థానంలో ఆకుమైలారం జట్టు, ద్వితీయ స్థానంలో కటికపల్లి జట్టు నిలిచాయి. విజేత జట్లకు సీపీ విష్ణువర్ధన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, సర్పంచులు కాకి ఇందిర దశరథ, జి.కలమ్మరాజు బహుమతులు అందజేసి అభినందించారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ట్రోఫీని ఆకులమైలారం జట్టు సభ్యుడు సంతోష్ అందుకున్నాడు. ఆకులమైలారం ఉప సర్పంచ్ ఎడ్ల రాంరెడ్డి, వార్డు సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

రైతు బజార్లలో కూరగాయల ధరలు



దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో...) టమోటా 19, వంకాయ 28, బెండ 45, పచ్చిమిర్చి45, కాకర 52, బీర 45, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 19, క్యారెట్ 31. దొండ 35, ఆలు 25, ఉల్లి 26, గోకర 50, దోస 28, సొర 11, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 45, అర్వి 55, మునగ 65, చిలగడదుంప 50, బీట్‌రూట్ 17, కీర 17, ఫ్రెంచ్ బీన్స్ 40, కాప్సికమ్ 60. ఈ ధరలు గురువారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

రోడ్డంతా గుంతలే

- అధ్వానంగా మారుతినగర్ ప్రధాన రహదారి
- పట్టించుకోని అధికారులు



గుంతలమయంగా మారిన మారుతినగర్ రోడ్డు

బడంగ్‌పేట్: ఎన్నికల ముందు ఓట్ల కోసం మున్సిపల్ కాలనీల్లోని రోడ్లు, డ్రైనేజీలు, సీసీరోడ్ల మరమ్మతులు, ఇతర మౌలిక సదుపాయాల కల్పిస్తామని నాయకులు చెప్పి ఓట్ల కోసం రోడ్లు తవ్వి ఎన్నికలు ముగిసినా కూడా పట్టించుకోకపోవడంతో ప్రధాన రోడ్లన్నీ గుంతలమయంగా మారి ప్రమాదకరంగా మారాయి. బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని కొత్తగా ఏర్పాటు చేసిన నూతన మున్సిపల్ కార్పొరేషన్ అల్మాస్‌గూడలోని రాజీవ్ గృహకల్పకు వెళ్లే ప్రధాన రహదారి మారుతినగర్ కాలనీ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. నాటి అధికారులు మారుతినగర్ మధ్య నుంచి వెళ్తున్న రోడ్డును పాయింట్‌గా తీసుకుని రోడ్డుకు ఇటు అటుగా ఉన్న ఇళ్లను 23వ, 28వ డివిజన్‌గా ఏర్పాటు చేసి కాలనీని రెండుగా విభజించారు. ఎన్నికల స్టంట్‌లో భాగంగా ఆయా డివిజన్ల కార్పొరేటర్లతో కలిసి అధికారులు బీటీ రోడ్డుగా ఉన్న ప్రధాన రహదారి మీదుగా డ్రైనేజీ అవుట్‌లైట్ వేస్తున్నామని చెప్పి రోడ్డును తవ్వి హడావిడిగా డ్రైనేజీ పైప్‌లైన్లు వేశారు. సుమారు వేయి ఇళ్లు ఉన్న ఈ కాలనీలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకోకుండా అతి చిన్న పైప్‌లైన్లు వేశారు. డ్రైనేజీ లైన్ వేసి అలాగే వదిలివేయడంతో ఇళ్లలో నుంచి వస్తున్న నీరు, కురిసిన వర్షాలకు రోడ్లు నిండి చెరువును తలపిస్తున్నాయి. మోకాళ్లలోతు గుంతలు ఏర్పడంతో వాహనదారులు బైకులపై వెళ్లలేని దుస్థితి ఏర్పడింది. ఆయా పనుల నిమిత్తం ఈ రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ గుంతల వల్ల కొత్తగా వేసిన డ్రైనేజీ కవర్లు సైతం పాడైయ్యాయి. సేఫ్ సైడ్ డ్రైవింగ్ పేరుతో వన్‌సైడ్ గా వెళ్తూ వాహనదారులు ఘర్షణలకు దిగుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే రోడ్డు పనులు చేపట్టాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

“ పనులు వదిలివేశారు



కాలనీకి డ్రైనేజీ అని చెప్పి.. ఇరుకైనా పైపులు వేసి డ్రైనేజీ లైన్‌ను పూర్తి చేసి వదిలివేశారు. ఎన్నికలు పూర్తయిన ఇంకా రోడ్డు పనులు చేయడం లేదు. దీని వల్ల నిత్యం కాలనీవాసులకు ఇబ్బందులు తలెత్తున్నాయి. అధికారులు, కార్పొరేటర్లు స్పందించి రోడ్డు వేసేలా చూడాలి.

– సైదులు, కాలనీవాసి

రంగవల్లులు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక



విజేతకు బహుమతి అందజేస్తున్న కార్పొరేటర్లు శివపార్వతి, నర్సింహా

కార్పొరేటర్ పెండ్యాల శివపార్వతి

మీర్‌పేట: రంగవల్లులు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని మీర్‌పేట కార్పొరేషన్ 9వ డివిజన్ కార్పొరేటర్ పెండ్యాల శివపార్వతి అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నందిహిల్స్ పేజ్–1 ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ముగ్గుల పోటీలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పోటీలకు పెద్ద సంఖ్యలో కాలనీ మహిళలు, యువతులు పాల్గొని ఉత్సాహంగా రంగు రంగుల ముగ్గులు వేయడం అభినందనీయమన్నారు. అనంతరం ఉత్తమ ముగ్గులను ఎంపిక చేసి బహుమతులను అందజేశారు. దీంతో పాటు పోటీల్లో పాల్గొన్న మరో 80 మందికి ప్రోత్సాహక బహుమతులు ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పెండ్యాల నర్సింహ, కాలనీ అధ్యక్షుడు నల్లా వెంకటేశ్వర్, కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, కోశాధికారి బట్టు శేఖర్, గౌరవ అధ్యక్షుడు డి.నగేష్‌యాదవ్, ముఖ్య సలహాదారు ఎం.దుర్గయ్య, కే.జగన్‌మోహన్‌రావు, జి.లక్ష్మీణ్, విక్కీసాగర్, మురళీచారి, బెల్లంకొండ నాగరాజు పాల్గొన్నారు.

వైభవంగా సహస్ర చండీ మహాయాగం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న గురూజీ తదితరులు

పీఆర్టీయూ సంఘం మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి

కందుకూరు: మండలంలోని పులిమామిడి పరిధిలోని శ్రీనిఖిల్ చేతనా కేంద్రంలో బ్రహ్మశ్రీ గురూజీ అనిల్ కుమార్ జోషి ఆధ్వర్యంలో చివరి రోజు బుధవారం సహస్ర చండీ మహా యాగాన్ని వైభవంగా నిర్వహించారు. వేద బ్రాహ్మణులతో ఐదు రోజుల పాటు సహస్ర చండీ పారాయణం పూర్తయిన అనంతరం యాగం నిర్వహించారు. పూర్ణాహుతి నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా వేద బ్రాహ్మణులను గురూజీ దంపతులను సన్మానించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



కొలువుదీరిన అమ్మవార్లు, దేవతా మూర్తులు

సందడిగా ముగ్గుల పోటీలు

హుడాకాంప్లెక్స్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని డాక్టర్స్‌కాలనీ సంక్షేమ సంఘం మహిళా మండలి ఆధ్వర్యంలో బుధవారం కాలనీ కమ్యూనిటీహాల్ ప్రాంగణంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు జగిని రాంమూర్తి, ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్‌రావులు మాట్లాడుతూ.. గడిచిన మూడు దశాబ్దాలుగా కాలనీలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ముగ్గుల పోటీలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రతి సంవత్సరం ఉగాది, గణపతి, దేవీ నవరాత్రులు, దీపావళి వేడుకలు వైభవంగా నిర్వహిస్తామన్నారు. పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు, మహిళలకు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ సమాజసేవలో పాల్గొంటున్నామని వివరించారు. కార్యక్రమంలో జనార్దన్‌రెడ్డి, దయాకర్, చంద్రయ్య, మమత, సరిత, నిత్య, అన్నపూర్ణ, సునీత, రాధిక, వాణి, రామలక్ష్మి పాల్గొన్నారు.



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

రంగవల్లులు మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక

సంప్రదాయాలకు రంగవల్లులు చిహ్నం.రైతులు పండించిన పంటలు ఇంటికి వచ్చినప్పుడు మహిళలు సంతోషంగా ముగ్గులు వేస్తారు. పిండి వంటలు చేసి ఆనందంగా గడుపుతారు. ముగ్గులు వేయ డం మహిళలకు స్ఫూర్తిదాయకం. సంప్రదాయాల ను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయండి



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటిస్తూ వేగవంతంగా పూర్తి చేయాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని సాహెబ్‌నగర్ క్రాంతి యువజన సంఘం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం ఆయన జీహెచ్‌ఎంసీ డీఈ దామోదర్‌తో కలిసి పరిశీలించారు. లచ్చిరెడ్డి మాట్లాడుతూ, డివిజన్‌లో ప్రతి సమస్యను పరిష్కరించి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని అన్నారు. కాలనీల్లో ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఏఈ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

ప్రతి ఒక్కరూ బీజేపీ పటిష్టతకు కృషి చేయాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ యువమోర్చా ఉపాధ్యక్షుడిగా నియమితులైన నిఖిల్‌కు బుధవారం లచ్చిరెడ్డి నియామక పత్రం అందజేశారు. డివిజన్ యువమోర్చా అధ్యక్షుడు గౌరి శంకర్, నాయకులు సంపత్, అక్బర్, అక్షయ్, సూర్య, రుత్విక్, ప్రణవ్, విశాల్, సందీప్, చరణ్, అలెక్స్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆన్‌లైన్ ప్రక్రియ

తుక్కుగూడ: ప్రభుత్వం ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగుతోందని మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ పేర్కొన్నారు. మున్సిపాలిటీ వ్యాప్తంగా 8,355 దరఖాస్తులు వచ్చాయి. నేటి వరకు 5 వేలకు పైగా దరఖాస్తులను ఆన్‌లైన్ చేశామన్నారు. గడువులోపు ఆన్‌లైన్ చేయడానికి మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మేనేజర్ వెంకటేష్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలైనా ఇవ్వండి .. డీడీలైనా తిరిగి ఇవ్వండి

- గొర్రెల మేకల పెంపకందారుల సంఘం అధ్యక్షుడు బి.రాములు యాదవ్

హుడాకాంప్లెక్స్: గొర్రెలైనా ఇవ్వండి లేదా డీడీలైనా తిరిగి ఇవ్వాలని రాష్ట్ర గొర్రెల మేకల పెంపకందారుల సంఘం అధ్యక్షుడు బి.రాములు యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గొల్ల కురుమలకు రెండో విడత గొర్రెల పంపిణీని తక్షణమే చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. లబ్ధిదారులైన గొల్ల కురుమలు అప్పు తెచ్చి రూ.43,750 చొప్పున డీడీల రూపంలో నగదు చెల్లించారని, తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయని, గొర్రెల యూనిట్లు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని లబ్ధిదారులకు గొర్రెలైనా, లేకుంటే నగదును వెనక్కి తిరిగి ఇచ్చేలా చొరవ తీసుకోవాలని కోరారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రెండో విడత గొర్రెల పంపిణీ ప్రక్రియ చేపడతామని కాంగ్రెస్ ఎన్నికల్లో హామీ ఇచ్చిందని గుర్తుచేశారు.

మోడల్ స్కూల్ ప్రవేశాలకు నోటిఫికేషన్

- 6వ తరగతిలో 100 సీట్లు 7,8,9,10వ తరగతుల్లో మిగిలిన సీట్లకు అవకాశం
- మహేశ్వరం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బి.ధనుంజయ్
- 12 నుంచి ఫిబ్రవరి 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు



మహేశ్వరం మోడల్ స్కూల్ భవనం

మహేశ్వరం: మహేశ్వరంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో 2024–25 విద్యా సంవత్సరానికి 6,7,8,9,10 తరగతులకు గాను ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల అయ్యిందని మహేశ్వరం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బి.ధనుంజయ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. 6వ తరగతిలో ఉన్న 100 సీట్లకు 7 నుంచి 10వ తరగతిలో మిగిలిన సీట్ల ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. గ్రామీణా ప్రాంతాల్లోని నిరుపేద విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన విద్యతో పాటు అన్ని వసతులతో కూడిన పక్కా భవనాలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, సీసీ కెమెరాల పర్యవేక్షణలో క్రమశిక్షణతో కూడిన విద్య అందిస్తున్నారు. వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. దరఖాస్తులను టీఎస్ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 6వ తరగతిలో ప్రవేశానికి 7 నుంచి10వ తగరతి ప్రవేశాల కోసం ఈ నెల 12 నుంచి ఫిబ్రవరి 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఓసీ విద్యార్థులకు రూ.200 ఎస్సీ,ఎస్టీ, బీసీ, వికలాంగుల విద్యార్థులకు రూ.125 రుసుం చెల్లించాల్సి ఉంటుంది. 6వ తరగతి పరీక్ష 100 మార్కులకు 100 ప్రశ్నలు ఉంటాయి. ప్రశ్న పత్రం తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో ఉంటుంది. తెలుగు, గణితం ఎన్విరాన్మెంట్ సైన్స్, ఆంగ్లం పాఠ్యాంశాల్లో ఒక్కో దాని నుంచి 25 ప్రశ్నలు వస్తాయి. రెండు గంటల పాటు ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్ష ఉంటుందన్నారు. హాల్ టికెట్లను ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 7న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు 6వ తరగతి పరీక్ష ఉంటుందని, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల 7వ తరగతి నుంచి 10వ తరగతులకు పరీక్ష ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మిగతా వివరాల కోసం 9849746567, 9603150011 ఫోన్ నంబర్లను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.



ధనుంజయ్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, మహేశ్వరం

డీఆర్‌డీఎల్ కాలనీ నూతన కార్యవర్గం ఎన్నిక



డీఆర్‌డీఎల్ కాలనీ రెసిడెన్షియల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

హస్తినాపురం: డీఆర్‌డీఎల్ కాలనీ రెసిడెన్షియల్ అసోసియేషన్ సభ్యులు బుధవారం సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాంప్రసాద్‌రావు, కార్యదర్శిగా కరుణాకర్‌రెడ్డి, కోశాధికారిగా యాదవరెడ్డి, ఉపాధ్యక్షుడిగా రాజేంద్రప్రసాద్‌రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సాయి కుమార్, జాయింట్ సెక్రటరీగా రమేష్‌గౌడ్, కార్యవర్గ సభ్యులుగా సోమేశ్వర్, దాసారామ్, రాజుగుప్తా, వెంకటేష్‌గుప్తాలను ఎన్నుకున్నట్టు నూతన అధ్యక్షుడు రాంప్రసాద్‌రావు తెలిపారు.

అష్టలక్ష్మి ఆలయంలో ఘనంగా ధనుర్మాస పూజలు

దిల్‌సుఖ్‌నగర్: వాసవి కాలనీలోని శ్రీ అష్టలక్ష్మి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం అష్టలక్ష్మి అమ్మవారికి, నారాయణస్వామివారికి ప్రత్యేక పూజలు, హారతి పాశురం కార్యక్రమం నిర్వహించారు. 25 శ్రీవైష్ణవ ఆలయాలకు విశేష శేషమాలలను అందజేసి.. వాటిని ఆలయాల నుంచి తిరిగి ఊరేగింపుగా అష్టలక్ష్మి ఆలయానికి తీసుకొచ్చి గోదా రంగనాయక స్వామి వారికి సమర్పించారు. అనంతరం దీపోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సోమా సరేష్, కోశాధికారి అంజయ్య, చిలుక ఉపేందర్‌రెడ్డి దంపతులు, ఎం. శ్రీనివాస్, డి.శ్రీనివాస్, శంకర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



అష్టలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన ఉపేందర్‌రెడ్డి తదితరులు

పట్టాలు ఇచ్చారు.. | పొజిషన్ ఇప్పించండి!

ఎమ్మెల్యే సబితారెడ్డికి డబుల్ ఇళ్ల లబ్ధిదారుల వినతి

దిల్‌సుఖ్‌నగర్: తమకు వెంటనే డబ్బుల్ బెడ్ రూమ్ ఇళ్ల పొజిషన్ ఇప్పించాలని మహేశ్వరం నియోజకవర్గంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు కోరారు. నిర్మాణం పూర్తయిన ఇళ్లను అధికారులతో మాట్లాడి వెంటనే తమకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌కేపురం, సరూర్‌నగర్‌తో పాటు వివిధ మున్సిపాలిటీలు, మండలాలకు చెందిన లబ్ధిదారులు ఎమ్మెల్యే సబితారెడ్డిని బుధవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తమకు డబుల్‌బెడ్‌రూమ్ ఇంటిని కేటాయిస్తూ అధికారులు పట్టాలు ఇచ్చారని, ఎన్నికల కారణంగా ఆ ఇళ్ల పొజిషన్ ఇంకా తమకు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలు ముగిసి నెల రోజులు కావస్తున్నా..ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సబితారెడ్డి చొరవ తీసుకొని తమకు కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇంటి పొజిషన్ ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో మంజుల, సక్కుబాయి, ఉమారాణి, సంధ్యా, హైమావతి, శోభారాణి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.



డబుల్ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థినుల ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వనస్థలిపురం: సిద్దిపేటలో ఈ నెల 11 (గురువారం) నుంచి జరిగే 49వ రాష్ట్రస్థాయి బాలికల కబడ్డీ పోటీలకు సాహెబ్‌నగర్‌లోని నక్క భాగమ్మ యాదవ్, నక్క వెంకటస్వామి యాదవ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న రమ్య, శ్రావణి, అక్షయలు హైదరాబాద్ జట్టు తరఫున ఆడనున్నారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో నక్క వెంకటమ్మ యాదవ్, నక్క యాదగిరిస్వామి యాదవ్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ నక్క శ్రీనివాస్‌యాదవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దినేష్‌కుమార్, పీఈటీ శ్రీను నాయక్, ఉపాధ్యాయులు నాగేషు విద్యార్థినులను అభినందించారు. పోటీల్లో విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబర్చాలని వారు ఆకాంక్షించారు.